సాక్షి నిర్మల్

మంగళవారం : 24 : జూన్ : 2025



మలేషియా జైలు నుంచి..

ఉపాధికోసం మలేషియా వెళ్లిన లింగాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు అక్కడి జైల్లో మగ్గారు. ఎట్టకేలకు వారు జైలు నుంచి తిరిగి స్వగ్రామానికి చేరారు. 8లో▸



అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

మోదీ పాలన స్వర్ణయుగమని, బీజేపీ పాలనలోనే దేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.1 /24.2

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో చాలాప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

అసాంఘిక అడ్డా..!

కొయ్య బొమ్మలు.. వ్యవసాయం.. నిమ్మ రాజుల చారిత్రక నేపథ్యం కలిగిన నిర్మల్ జిల్లా కొన్ని రోజులుగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఒకవైపు మత్తు పదార్థాలు జిల్లాను ముంచెత్తుతున్నాయి. ఇంకోవైపు దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు పెరుగుతున్నాయి. ఇక తాజాగా కిడ్నాప్‌లు జరుగుతున్నాయి. ఇక మత్తు పదార్థాల తయారీకి కేంద్రంగా మారింది. జిల్లాను డ్రగ్స్ ఫ్రీగా మారుస్తామని కలెక్టర్, ఎస్పీ ప్రకటిస్తున్నారు. ఇంకోవైపు దందా విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు ఎన్ని ఎత్తుగడలు వేస్తున్నా.. జిల్లా అధికారులు ఎన్ని ప్రచారాలు చేస్తున్నా.. అసాంఘిక కార్యకలాపాలు మాత్రం ఆగడం లేదు. – నిర్మల్



- రెచ్చిపోతూనే ఉన్న చైన్‌స్నాచర్లు
- ఇటీవల కొత్తగా కిడ్నాప్‌లు..
- గంజాయి మత్తులో యువతరం
- తాజాగా వెలుగులోకి మత్తుమందు తయారీ..
- పోలీసులకు సవాల్

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. యువత గంజాయి, కొత్త డ్రగ్స్ మత్తులో మునిగి, వాటిని దందాగా మార్చుకుంటోంది. మత్తులో తామేం చేస్తున్నారో తెలియక, ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారు. గంజాయి దందా జిల్లా నలుమూలలకూ విస్తరించింది. యువతను బానిసలుగా, విక్రేతలుగా మార్చుతోంది. పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టినా ఈ అక్రమ దందాకు చెక్ పడడం లేదు. యువత భవిష్యత్తును కాపాడేందుకు కఠిన చర్యలు అవసరమని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

క్లోరోహైడ్రేట్ తయారీ ఇక్కడే..

చెట్ల నుంచి సహజంగా రావాల్సిన కల్లు చేతుల్లోనే తయారవుతోంది. తాటి, ఈత చెట్లతో సంబంధం లేకుండానే సీసాల్లో చేరుతోంది. ఇప్పటిదాకా క్లోరోహైడ్రేట్, ఆల్ప్రాజోలం వంటి నిషేధిత మత్తుపదార్థాలను తీసుకువచ్చి, ఇక్కడ కృత్రిమ కల్లును తయారు చేసేవారు. కానీ తాజాగా వెలుగులోకి వచ్చిన విషయమేమంటే జిల్లాలోనే కల్లు తయారీకి ముడిపదార్థమైన క్లోరోహైడ్రేట్‌నే ఇక్కడే తయారు చేస్తుండటం. నిర్మల్‌రూరల్ మండలం చిట్యాల వద్ద వ్యవసాయక్షేత్రంలోని ఓ గదిలో గుట్టుగా క్లోరోహైడ్రేట్ తయారు చేస్తున్నట్లు గుర్తించిన ఎక్సైజ్ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు మూడురోజుల క్రితం దాడి చేశారు. బుర్ర రమేశ్‌గౌడ్, రామాగౌడ్‌తోపాటు శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, రాజుగౌడ్ దీనిని తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ముంబైలోని భీవండి ప్రాంతం నుంచి క్లోరో అనే ద్రవపదార్థాన్ని తీసుకువచ్చి, దానిని గడ్డకట్టించి, క్లోరోహైడ్రేడ్‌గా తయారుచేస్తున్నారు. చిట్యాలలో 425 కిలోల క్లోరోహైడ్రేట్, పదికిలోల వరకు ఆల్ప్రాజోలం పట్టుకున్నారంటే.. జిల్లాలో ఎంత భారీమొత్తంలో కల్తీకల్లు దందా నడుస్తుందో అర్థంచేసుకోవచ్చు.

చైన్‌స్నాచింగ్‌లు, గంజాయి బ్యాచ్‌లు

జిల్లాలో ఇటీవల కాలంలో కలవర పెడుతున్న మరో రెండు విషయాలు చైన్‌స్నాచింగ్‌లు, గంజాయి అమ్మకాలు. పల్లె పట్నం తేడా లేకుండా అంతటా ఇవి రెండూ పెరుగుతున్నాయి. పోలీసులు ఎంత పకడ్బందీగా వ్యవహరిస్తున్నా.. ఇవి కొనసాగుతూనే ఉండటం ప్రజలను కంగారు పెడుతున్నాయి. గంజాయి దందా జిల్లా నలుమూలలా విస్తరించి యువతను మత్తుకు బానిసలుగా మార్చడమే కాకుండా, వారినీ విక్రేతలుగా మారుస్తుంది. ఇటీవల ఒకే రోజు భైంసా, నిర్మల్ రెండు మున్సిపాలిటీల్లో చైన్‌స్నాచింగ్‌లు కావడం సంచలనంగా మారింది. ఇలా ఏదో ఒకచోట చోరీలు జరుగుతూనే ఉన్నాయి.

పోలీసులకు సవాల్..

ఒక దిక్కు కలెక్టర్, ఎస్పీ సహా అధికారులంతా మత్తుపదార్థాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు.. గంజాయి సహా అసాంఘిక కార్యకలాపాలన్నీ పెరుగుతూ వారికి పెనుసవాల్‌గా మారుతున్నాయి. మత్తుపదార్థాలపై పోరు చేస్తున్న ఈవారంలోనైనా కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

కొత్తగా కిడ్నాపులు..

జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా కొత్తగా కిడ్నాప్‌లూ జరుగుతుండడం కలవర పెడుతోంది. ఇటీవల మామడ మండలం పొన్కల్ నుంచి సీనియర్ నేత చిక్యాల హరీశ్‌రావును కిడ్నాప్ చేసిన ఆయన వాహనంలోనే తీసుకెళ్లడం, తూఫ్రాన్ టోల్‌ప్లాజా వద్ద ఆయన తప్పించుకోవడం, తీరా.. పోలీసుల విచారణలో గతంలో ఆయన వద్ద పనిచేసిన వ్యక్తే నిందితుడుగా తేలడం అంతా.. సినిమాను తలపించింది. ఇక మెదక్ జిల్లాలోనే భైంసా పోలీసులపై జరిగిన దాడి ఘటనలో పట్టణం నుంచి ఓ బాలికను కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లినట్లు తెలిసింది.

కఠిన చర్యలు చేపడుతున్నాం..

గంజాయి, చైన్‌స్నాచింగ్ సహా అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుశాఖ తరఫున కఠినంగా వ్యవహరిస్తున్నాం. రెండు నెలల్లోనే 23 మందిపై కేసులు నమోదుచేశాం. పలువురు చైన్‌స్నాచర్లనూ పట్టుకున్నాం. మత్తురహిత జిల్లా కోసం శాఖ తరఫున ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం.

–జానకీషర్మిల, ఎస్పీ

న్యూస్‌రీల్

అన్నదాతకు బాసటగా 'రైతు భరోసా'

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి నిధులు ఖాతాల్లో జమ చేస్తోందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. రైతు భరోసా నిధుల జమ ప్రక్రియ జిల్లాలో దాదాపు పూర్తి కావచ్చిందని పేర్కొన్నారు. సోమవారం నాటికి జిల్లాలో మొత్తం రూ.260.80 కోట్లు జమయ్యాయని వెల్లడించారు. జిల్లాలో మొత్తం 1,86,400 మంది రైతులు ఉండగా, 1,85,116 మంది ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నిధులు చేరాయని తెలిపారు. మిగిలిన రైతులకు త్వరలోనే నిధులు జమవుతాయని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



రన్‌ను ప్రారంభిస్తున్న కిశోర్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ జ్యోతి వెలిగించి, జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు, అక్కడి నుంచి తిరిగి స్టేడియం వరకు ఈ రన్ సాగింది. అనంతరం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో క్రీడలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఏసీజీఈ పరమేశ్వర్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి, పెటా ప్రెసిడెంట్ భూక్యా రమేశ్, సెక్రెటరీ భోజన్న, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 'విద్యుత్ ప్రజావాణి' ప్రతీ సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్మల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సుదర్శనం తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదులను తీసుకుని వాటిని సకాలంలో పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు విద్యుత్ ప్రజావాణిలో 522 ఫిర్యాదులు రాగా, 521 పరిష్కరించామని పేర్కొన్నారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల, మీటర్లు, విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు, కేటగిరీ మార్పు, పేరు మార్పు ప్రమాద భరితంగా ఉన్న స్తంభాలు వంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వివరించారు. సర్కిల్ పరిధిలోని డివిజన్, ఈఆర్వో, సబ్ డివిజన్, సెక్షన్ ఆఫీస్‌లలో ప్రతీ సోమవారం ఉదయం 10 నుండి 1 గంట వరకు సర్కిల్ ఆఫీస్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు చేయాలని సూచించారు.

సామాన్యులకు అండగా పోలీసులు

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: సామాన్యులకు పోలీసులు అండగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

డ్రగ్ రహిత సమాజమే లక్ష్యం

నిర్మల్‌టౌన్: డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ' జాగ్రత్త మాదకద్రవ్యాలు మీ జీవితాన్ని నాశనం చేస్తాయి' డ్రగ్స్ నో చెప్పండి' అనే పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం 'ఐ యామ్ యాంటీ డ్రగ్ షోల్జర్' అనే సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగి 'సే నో టు డ్రగ్స్ ఎస్ టు లైఫ్' అనే పోస్టర్‌పై సంతకాలు చేశారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో నంబర్ 8712671111కు లేదా డయల్ 100 లేదా మీ పరిధిలో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేంద్రారెడ్డి, ఏవో యూనస్ అలీ, డీఎస్బీ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య , ఆర్ఐ రామ్ నిరంజన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ జానకీషర్మిల

తలాపు గోదావరి.. చెరువులు ఎడారి



పంచగుడి పక్కనే గోదావరి నది



నీరు లేక వెలవెల బోతున్న ధర్మోర పెద్ద చెరువు

- ఎత్తిపోతల పథకం కోసం ఎదురుచూపులు
- గోదావరి జలాలతో చెరువులు నింపాలని డిమాండ్

లోకేశ్వరం : గోదావరి నది సమీపంలో ప్రవహిస్తున్నా నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని అనేక గ్రామాల చెరువులు నీటి చుక్క కోసం అలమటిస్తున్నాయి. ఎస్సారెస్పీ(శ్రీరాంసాగర్ ప్రాజెక్టు) నిండుగా ఉండి, నీరు దిగువకు ప్రవహిస్తున్నా, సమీప గ్రామాల చెరువులు ఎడారులను తలపిస్తున్నాయి. రానున్న రోజుల్లో నీటి కొరత తప్పేలా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుప్త పథకం విజయం...

నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని చెరువులను నింపేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో గుప్త ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసింది. ఈ పథకం వల్ల నందిపేట్ చెరువులు నిండుగా ఉండి, జలకళను సంతరించుకున్నాయి. అయితే, ఇదే గోదావరి నీరు సమీపంలోని నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని చెరువులకు, కుంటలకు అందడం లేదు. ఈ ప్రాంతంలోని చెరువులు నీరులేక వెలవెలబోతున్నాయి. గుప్త వంటి ఎత్తిపోతల పథకాన్ని ముథోల్ నియోజకవర్గంలో కూడా నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ సమీపంలోనే నీటి కష్టాలు

ఎస్సారెస్పీ సమీపంలో ఉన్న కుంటాల, లోకేశ్వరం, బాసర, ముథోల్ మండలాల గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. గోదావరి నీరు పక్కనే ప్రవహిస్తున్నా, ఈ గ్రామాల చెరువులకు నీరు చేరే మార్గాలు లేవు. దీంతో చెరువులు బోసిపోయి, ఎడారులను తలపిస్తున్నాయి. గుప్త వంటి ఎత్తిపోతల పథకాన్ని ఈ ప్రాంతంలో నిర్మిస్తామని గతంలో ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ, ఆ ప్రకటనలు అమలుకు నోచుకోలేదు.

రైతుల ఆకాంక్ష...

ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు తమ మండలాలపై దృష్టి సారించి, గుప్త వంటి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని రైతులు కోరుతున్నారు. పైపుల ద్వారా గోదావరి నీటిని చెరువులకు చేర్చడం ద్వారా నీటి కొరతను తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ముథోల్ నియోజకవర్గం గ్రామాల చెరువులను జలకళతో నింపాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ముథోల్ నియోజకవర్గంలో చెరువులు నింపేందుకు గోదావరి నది ఒడ్డున లిఫ్ట్ నిర్మించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రైతుల డిమాండ్‌ను కూడా నివేదిస్తాం. నిధులు మంజూరు నిర్మాణం పనులను చేపడుతాం. చెరువులు నింపేలా ప్రణాళిక రూపొందిస్తాం.

– అనిల్, ఇరిగేషన్ డీఈ

చుక్క నీరు చేరలే



లోకేశ్వరం చుట్టు పక్కల కుంటలు, చెరువులు కలిపి దాదాపు పది ఉంటాయి. చెరువుల్లో చుక్కనీరు చేరలేదు. చెరువులు నిండితే ఆయకట్టు కింద పంటలు పండుతాయి. లోకేశ్వరం మండలంలోని చెరువులకు లిఫ్ట్ ద్వారా నీటిని తరలిస్తే సమస్య అధిగమించ వచ్చు.

– ఎల్లయ్య, వట్టోలి.

లిఫ్ట్‌లు నిర్మించాలి..



గోదావరిలో పుష్కలంగా నీరున్నా మా మండలంలోని చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేదు. లిఫ్ట్‌ల ద్వారా చెరువులకు గోదావరి జలాలను మళ్లించాలి. మండలంలోని చెరువులు కుంటలు నింపితే ఆయకట్టు సస్యశ్యామలమవుతుంది. రైతుల కష్టాలు తీరుతాయి.

– గీజా భూమన్న, ధర్మోర

పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి



మాట్లాడుతున్న చావ రవి

నిర్మల్ రూరల్: రాష్ట్రంలో ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి గురుకులాల్లో డేస్‌స్కాలర్స్ విద్యార్థులను కూడా చేర్చాలని ప్రకటించడాన్ని ఖండించారు. ఇలా చేస్తే గ్రామాల్లో ఉన్న పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సెమీ గురుకులాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలంటే తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్నారు. బడుల్లో పర్యవేక్షణ భౌతిక వసతులు ప్రభుత్వం కల్పించాలన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులు, సీపీఎస్ తదితర అంశాలపై ప్రభుత్వం స్టాండ్ తెలుపాలని డిమాండ్ చేశారు. ఇందులో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, నాగయ్య, రాజేశ్వర్, గోవర్ధన్‌రావు, గంగాధర్, షేక్ ఫాజిల్, శ్రీనివాస్, వీరేశ్, లక్ష్మణ్, రాథోడ్ గణపతి పాల్గొన్నారు.

ప్రజావాణి.. పరిష్కారం ఏది?

- ఒకే సమస్యపై పదే పదే అర్జీలు
- వివిధ కారణాలతో కాలయాపన
- సోమవారం గ్రీవెన్స్‌కు 117 అర్జీలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదులు స్వీకరిస్తున్నా.. సమస్యల పరిష్కారంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదై, సంబంధిత శాఖలకు వెళ్తున్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో పరిష్కారం విషయంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వివిధ కారణాలు చూపుతూ కాలయాపన చేస్తున్నారు. దీంతో బాధితులు మళ్లీ మళ్లీ కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఒకే సమస్యపై పలుమార్లు దరఖాస్తులు ఇస్తున్నారు.

అదనపు కలెక్టర్ ఆదేశాలు

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 117 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ వానాకాలంలో శానిటేషన్, వన మహోత్సవంలో మొక్కలు నాటడం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

సదరం సర్టిఫికెట్ ఇవ్వాలి..



మేము తలసేమియా, సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్నాం. మాకు ఇంతవరకు సదరం సర్టిఫికెట్ ఇవ్వలేదు. పెన్షన్ రావడం లేదు. వేరే రాష్ట్రాలలో సదరం సర్టిఫికెట్ ఇస్తున్నారు. మాకూ కూడా సదరం సర్టిఫికెట్ ఇప్పించి ఆదుకోవాలి.

– తల సేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు

సోన్ తహసీల్దార్‌పై ఫిర్యాదు



సోన్: రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న సోన్ తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని కలెక్టరేట్ ఎదుట కడ్తాల్ గ్రామానికి చెందిన రైతులు సోమవారం ఆందోళన చేశారు. అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. భూసమస్యలపై కార్యాలయానికి వెళ్తే గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరక్షరాస్యులైన రైతులను తెలిసినవారు కార్యాలయానికి తీసుకెళ్తే బ్రోకర్లు అంటూ చులకనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ మాట్లాడితే మీ సర్వే నంబర్లను రెడ్ మార్క్ చేస్తానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

25 శాతం సీట్లు కేటాయించాలి



విద్యాహక్కు చట్టం – 2009లోని సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించాలి. 2025– 26 విద్యా సంవత్సరం నుంచి జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టంగా అమలు చేయాలి.

– కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ నాయకులు

అంగన్‌వాడీ భవనం నిర్మించాలి..



మేము ఖానాపూర్ మున్సిపాలిటీ మూడో వార్డు అంబేద్కర్ నగర్ వాసులం. మా కాలనీలో అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం లేదు. నూతన భవనానికి స్థలం ఉంది. చిన్నారుల శ్రేయస్సు కోసం కొత్త భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. అదే విధంగా కాలనీలోని బెల్ట్ షాపు, కల్లు దుకాణం తొలగించాలని కోరారు.

– ఖానాపూర్ మూడోవార్డు వాసులు

చదువుకునే అవకాశం కల్పించాలి



నా చిన్నతనంలోనే అమ్మా నాన్నను కోల్పోయాను. నా పోషణ మా అమ్మమ్మ చూసుకుంది. ప్రస్తుతం ఆమెకు వయస్సు పైబడటంతో నా పోషణ భారంగా మారింది. నేను ఏడో తరగతి చదువుకోవాలనుకుంటున్నాను నాకు ప్రభుత్వ గురుకులం లేదా మహాత్మ జ్యోతిబాఫూలే పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించండి.

– కోడె మనోజ్, నర్సాపూర్(జి)

ఇల్లు క్యాన్సిల్ అయింది..



నేను దళితురాలిని. నాకు సొంతంగా ఇల్లు లేదు. నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది. లిస్టులో పేరు వచ్చింది. కొందరు నాయకులు కావాలనే మంజూరు అయిన ఇల్లు క్యాన్సిల్ చేయించారు. అధికారులు విచారణ న్యాయం చేయాలి.

– హేమలత, పాత మద్దిపడగ

ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ అందించాలి



నా భర్త వెంకటేశ్ బహ్రెయిన్‌లో గతేడాది నవంబర్ 23 మరణించారు. ప్రభుత్వం అందించే నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ కింద వచ్చే సొమ్ము కోసం దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు ఈ స్కీం కింద వచ్చే సొమ్మును మంజూరు చేసి నన్ను ఆర్థికంగా ఆదుకోవాలి.

– లావణ్య, సారంగాపూర్

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



కలెక్టరేట్ లో నిరసన తెలియజేస్తున్న పెన్షనర్లు

నిర్మల్‌చైన్‌గేట్: పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కలెక్టరేట్ ఎదుట ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. కొత్త పెన్షన్ విధానంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎసరుపెట్టే ప్రయత్నం చేస్తుందని పెన్షనర్ల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం సీ.లింగన్న ఆరోపించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఫైనాన్స్ బిల్లులో చేర్చి ఆకస్మాత్తుగా ఈ ఏడాది మార్చి 25న లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించారన్నారు. కొత్త పద్ధతి పెన్షన్ విధానాన్ని అడ్డుకోవాలని ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఉద్యమ నిర్మాణానికి నడుం బిగించిందన్నారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఒకే రోజు అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రధానమంత్రికి లేఖలు పంపేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వేల సంఖ్యలో పెన్షనర్ల సంతకాలు సేకరించి వాటిని ప్రధానమంత్రికి పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు అందించారు. కార్యక్రమంలో పెన్షనర్లు విలాస్, లోలం గంగన్న, జనార్దన్, సత్యారాం, రాములు వివిధ మండలాల నుంచి వచ్చిన పెన్షనర్లు పాల్గొన్నారు.

బతికుండగానే చంపేశారు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు చవాన్ సోమల. కుబీర్ మండలం కసర గ్రామానికి చెందిన సోమల ఉమ్మడి రాష్ట్రంలో రూ.200 పింఛన్ తీసుకున్నాడు. రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంట్లో ఒకరికే పెన్షన్ విధానం తెచ్చింది. దీంతో సోమల పెన్షన్ కట్‌చేసి.. ఆయన భార్య తిత్రీబాయికి వితంతు పెన్షన్ రూ.2 వేలు మంజూరు చేసింది. ఈ సమయంలో సోమల బతికి ఉండగానే చనిపోయినట్లు నమోదు చేశారు. రెండేళ్ల క్రితం తిత్రీబాయి మరణించింది. తనకు వృద్ధాప్య పెన్షన్ తనకు ఇవ్వాలని సోమల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ అధికారులు తాను చనిపోయాడని తిరస్కరించారని, తాను బతికుండగానే చంపేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన గోడును కలెక్టర్‌కు చెప్పుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చాడు. తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని అదనపు కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ సోమవారం తీర్పు నిచ్చినట్లు కోర్టు డ్యూటీ ఆఫీసర్ డల్లు సింగ్ తెలిపారు. నేరడిగొండ మండలం బంధం గ్రామానికి చెందిన పన్నాల రాజు జిల్లా కేంద్రానికి చెందిన రాజారాంపై కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చార్జి షీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టినట్లు హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. ఉట్నూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల వైపు వెళ్తుండగా వేంపల్లి మేకల మండి సమీపంలో మేకల మంద అడ్డు రావడంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేశాడు. అదే సమయంలో వెనకనుంచి వస్తున్న టిప్పర్ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు వెనకభాగం పూర్తిగా ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ చొప్పదండి మొగిళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ గౌరమ్మ భట్టి వద్ద గల షేక్ వసీమ్ ఇంట్లో ఆదివారం రాత్రి షేక్ తౌఫిక్, సయ్యద్ ఫైసల్, షేక్ వసీమ్, అఫ్రోజ్, జాహెద్, నాజిమ్ పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేయడంతో పాటు వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలతో పాటు రూ.5,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తప్పించుకున్న ఖైదీ అరెస్ట్

మంచిర్యాలక్రైం: ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఖైదీని కోర్టులో హాజరు పరిచేందుకు సోమవారం తీసుకురావడంతో పోలీసుల కళ్లు గప్పి పారిపోయిన ఘటన కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీకి చెందిన తీగల భాగ్యలక్ష్మి (45)ని మిట్టపల్లి వీరస్వామి 2024 డిసెంబర్ 8న బండరాయితో మోది హత్య చేశాడు. మంచిర్యాల పోలీసులు అరెస్ట్ చేసి ఆదిలాబాద్‌కు రిమాండ్‌కు తరలించారు. విచారణ నిమిత్తం మంచిర్యాల కోర్టుకు తీసుకురాగా నీళ్లుతాగుతానని వెళ్లి పారిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు గంట వ్యవధిలోనే పట్టుకున్నారు. స్థానిక సీఐని వివరణ కోరగా తప్పించుకున్నది వాస్తవమేనని, వెంటనే పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

బెల్లంపల్లి: కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య తెలిపిన వివరాల మేరకు కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన షేక్ మహ్మద్ (40) పెయింటింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మహ్మద్‌కు అతని భార్య షహీనాకు మధ్య ఇటీవల మనస్పర్థాలు రావడంతో కూతుర్ని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో కలత చెందిన మహ్మద్ హన్మాన్‌బస్తీలోని అత్తారింటికి వెళ్లి పెరట్లో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఎస్సై రాకేష్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- బైక్‌పై వచ్చిన ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగలు
- గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎం బాక్స్‌ను కట్ చేసిన దుండగులు
- ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన ఏటీఎం

బెల్లంపల్లి: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో సోమవారం తెల్లవారుజామున అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు చోరీకి యత్నించిన ఘటన కలకలం రేపింది. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపిన వివరాల మేరకు కాల్‌టెక్స్ ఏరియాలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో బజాజ్ షోరూం పక్కన ఉన్న ఏటీఎం వద్దకు తెల్లవారు జామున సుమారు 3:15 గంటల ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చారు. వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం బాక్స్ దిగువన కొంతమేర కట్ చేశారు. అదే సమయంలో రైల్వేస్టేషన్ ప్రాంతంలో పెట్రోలింగ్‌కు వెళ్లిన బ్లూకోర్ట్ పోలీసులు టూటౌన్ వైపు వస్తుండగా ఏటీఎం షట్టర్ మూసి ఉండటంతో అనుమానం వచ్చి ఆగారు. ఏటీఎం పక్కన రెండు బైక్‌లు పార్కింగ్ చేసి ఉండడం గమనించి వాటి సైలెన్సర్లను చేతితో టచ్ చేయడంతో వేడి సెగ తగిలింది. వెంటనే టూటౌన్ ఎస్సై మహేందర్‌కు సమాచారం అందించారు. అప్పటికే శాంతిఖని బస్తీవైపు పెట్రోలింగ్ చేస్తున్న ఎస్సై స్టేషన్‌కు వెళ్లి హెడ్ కానిస్టేబుల్‌ను వెంట తీసుకుని వెళ్లమని ఆదేశించారు. ఆ ప్రకారంగానే ఏటీఎం వద్దకు వెళ్లడంతో పోలీసులను గమనించిన దొంగ పక్కనున్న గోడదూకి పారిపోయేందుకు యత్నించాడు. అడ్డుకున్న పోలీసులపై వెంట తెచ్చుకున్న కారం పొడిని చల్లాడు. అయినా పోలీసులు దొంగను చాకచక్యంగా పట్టుకున్నారు. మిగిలిన దొంగలు అప్పటికే పలాయనం చిత్తగించారు. కాగా కరీంనగర్ నుంచి ఏటీఎం సిబ్బంది వచ్చి పరిశీలించారు. ఖాళీ బాక్స్ మాత్రమే అపహరణకు గురైనట్లు గుర్తించారు. నగదు చోరీ కాలేదన్నారు.

హర్యానా ముఠా పనేనా?

ఏటీఎంలో చోరీకి యత్నించింది హర్యానాకు చెందిన దొంగల ముఠా సభ్యులేనని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న దొంగ తనది హర్యానా అని చెప్పడంతో నిందితులంతా ఆ ప్రాంతానికి చెందిన వారై ఉంటారని భావిస్తున్నారు. పారిపోయిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు తీవ్రతరం చేసినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలంలో గ్యాస్ కట్టర్, గ్యాస్ సిలిండర్, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, పలువురు ఎస్సైలు ఘటనాస్థలిని సందర్శించారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తులను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని టీకంగర్ జిల్లాకు చెందిన సౌరభ్ రాయక్వార్, రితిక్‌సేన్ వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వర్క్‌ఫ్రం హోం అంటూ రోజుకు రూ.2 వేల నుంచి రూ.8 వేల వరకు సంపాదించవచ్చని అమాయకులను బురిడీ కొట్టిస్తున్నట్లు తెలిపారు. హాయ్ నాపేరు టీనా.. అంటూ వాట్సాప్‌లో పరిచయం.. టెలిగ్రామ్‌లో టాస్క్‌లు పంపుతూ అధిక డబ్బు ఆశ చూపుతూ ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని జందాపూర్‌కు చెందిన చెన్న శివకుమార్ నుంచి రూ.5 లక్షల 3వేల వరకు వసూలు చేశారన్నారు. ఈనెల 14న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగతా ముఠా సభ్యులను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదరు నిందితులు 25 వాట్సాప్ గ్రూప్‌లను నడుపుతున్నారని, ఇందులో 250 మంది సభ్యులు ఉన్నారన్నారు. నెలకు రూ.30 లక్షల వరకు ట్రాన్సెక్షన్ చేశారన్నారు. దాదాపు 900 మందిని మోసం చేసినట్లు గుర్తించామన్నారు. వీరికి సంబంధించిన సైబర్ మోసగాళ్లు విదేశాల్లో ఉంటూ ఏజెంట్ల ద్వారా అమాయకులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలియని వెబ్‌సైట్లు, లింక్‌లను ఓపెన్ చేయవద్దని ఎస్పీ సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

చిరుత కాదు బెబ్బులి..

- రఘునాథ్‌పూర్ అడవుల్లో సంచారం
- ట్రాప్ కెమెరాకు చిక్కిన పులి
- సమీప గ్రామాల్లో హైఅలర్ట్



ఇటీవల పులి హతమార్చిన లేగదూడ కళేబరం

బోథ్: బోథ్ అడవుల్లో బెబ్బులి సంచారం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. వారం రోజులుగా బోథ్ మండలంలోని కంటెగాం, నిగిని, మర్లపెల్లి, నారాయణపూర్, రఘునాథ్‌పూర్ గ్రామాల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోంది. వారం క్రితమే కంటెగాం చెరువు సమీపంలో ఓ ఆవును, ఈ నెల 19న రఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతంలో ఓ లేగదూడను హతమార్చింది. అయితే తొలుత చిరుతగా భావించిన అధికారులు అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ట్రాప్ కెమెరాలో పెద్దపులి కనిపించడంతో అప్రమత్తమయ్యారు.

తిప్పేశ్వర్ నుంచి రాక..

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుంచి పెద్దపులులు తరచూ వచ్చి వెళ్తున్నాయి. తాజాగా తిప్పేశ్వర్ నుంచే బోథ్ అటవీ ప్రాంతానికి పులి వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో చింతల్‌బోరి, వజ్జర్, గొల్లాపూర్, చింతగూడ, నేరుడుపల్లె నుంచి నిగిని మీదుగా సారంగాపూర్, అడెల్లి ప్రాంతాల్లో పులి సంచరించి కవ్వాల్ అటవీ ప్రాంతానికి వెళ్లింది. ప్రస్తుతం కూడా అడెల్లి నుంచి కవ్వాల్ వైపు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అడెల్లి దారిలో అలర్ట్

పులి సంచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ధన్నూర్, రఘునాథ్‌పూర్ మీదుగా అడెల్లి, సారంగాపూర్ వెళ్లేవారు అలర్ట్‌గా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రఘునాథ్‌పూర్ వద్ద గల గుట్ట వెనక నుంచి నారాయణపూర్, అడెల్లి, మర్లపెల్లి, నిగిని, కంటెగాం అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అటవీశాఖ అధికారులు సోమవారం రఘునాథ్‌పూర్, నారాయణపూర్ గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులను అలర్ట్ చేశారు. గ్రామస్తులెవరూ అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. చిన్నారులు, వృద్ధులు అటవీ ప్రాంతంలోని చేలలోకి వెళ్లవద్దన్నారు. కాగా బోథ్ అడవుల్లో పులి సంచారం ఏడాదిలో ఇది రెండవసారి. గతేడాది అక్టోబర్‌లో సంచరించిన పులి మళ్లీ జూన్‌లో బోథ్ మండలానికి వచ్చింది.

మలేషియా జైలు నుంచి స్వగ్రామానికి..

- కేటీఆర్, జాన్సన్‌నాయక్ చొరవతో ఇంటికి చేరిన ముగ్గురు బాధితులు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

కడెం: ఉన్న ఊళ్లో ఉపాధి లేక.. కుటుంబ పోషణకోసం పొట్టచేత పట్టుకుని కుటుంబ సభ్యులను వదిలి ఉపాధికోసం దేశం కాని దేశం వెళ్లి నరకయాతన అనుభవించారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కడెం మండల వాసులు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గుండారపు శ్రీనివాస్ 2023 జనవరిలో, అదే గ్రామానికి చెందిన రాచకొండ నరేశ్ మార్చిలో, మున్యాల్‌కు చెందిన యమునూరి రవీందర్ జూన్‌లో ఉపాధి నిమిత్తం మలేషియా దేశానికి వెళ్లి 17 నెలల క్రితం జైలు పాలయ్యారు.

జైల్లో నరకయాతన..

మలేషియాలో ఉపాధి కల్పిస్తానని ఓ ఏజెంట్ ఈ ముగ్గురికి ఆశ చూపాడు. రూ.60 వేలు కడితే అక్కడ రూ.30 వేల జీతం వస్తుందని చెప్పడంతో విజిట్ వీసాపై మలేషియా వెళ్లారు. అక్కడ అల్యూమినియం కంపెనీలో లేబర్ పనులు చూపించాడు. కొద్ది నెలలు బాగానే ఉన్నా ఆతర్వాత పనుల్లేక పస్తులున్నారు. ఉపాధికోసం తిరుగుతున్న క్రమంలో అక్కడి పోలీసులకు చిక్కడంతో అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. విజిట్ వీసాపై వెళ్లినవారు అక్కడి నిబంధనల ప్రకారం పర్మినెంట్ చేసుకోవాలంటే రూ.2 లక్షలు కట్టాల్సి ఉంటుంది. చేసేదేంలేక రూ.2 లక్షలు కట్టి పర్మినెంట్ చేసుకుందామని అనుకున్నారు. కానీ అక్కడి ప్రభుత్వం నిబంధనలు సవరించడంతో 2023 తర్వాత వచ్చిన వారికి పర్మినెంట్ అయ్యే అవకాశం చేజారింది. దీంతో ముగ్గురు 7 నెలల 17 రోజుల పాటు జైల్లో మగ్గారు.

కేటీఆర్, జాన్సన్‌నాయక్ చొరవతో..

తమవారు జైలులో బంధీలుగా ఉన్నారని, ఎలాగైనా వారిని ఇంటికి రప్పించాలని బాధిత కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్‌ను వేడుకున్నారు. స్పందించిన ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సలహా మేరకు మూడుసార్లు మలేషియా వెళ్లి అక్కడి జైలు అధికారులతో మాట్లాడారు. ఇద్దరు న్యాయవాదులను ఏర్పాటు చేసి సదరు వ్యక్తులను జైలునుంచి విడిపించారు. బయటకు వచ్చిన వారికి తమ సొంత ఖర్చులతో విమాన టికెట్ ఇప్పించడంతో ఈనెల 10న స్వగ్రామానికి చేరుకున్నారు. ఇంటికి తిరిగి వస్తామని కలలో కూడ అనుకోని వారు కేటీఆర్, జాన్సన్‌నాయక్ చొరవతో ఇంటికి చేరుకున్నారు. తమ వారిని ఇంటికి చేర్చిన జాన్సన్‌నాయక్‌ను సోమవారం బాధిత కుటుంబ సభ్యులు ఖానాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


ఇంటికి వస్తామనుకోలే



జైలు నుంచి మమ్మల్ని విడిపించి ఇంటికి రప్పించిన కేటీఆర్, జాన్సన్‌నాయక్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. జైల్లో ఉన్న మేము ఇంటికి వస్తామని కలలో కూడా అనుకోలేదు. జాన్సన్ అన్న మూడుసార్లు వచ్చారు. విడిపిస్తానని భరోసానిచ్చారు.

– రాచకొండ నరేశ్, లింగాపూర్

నరకయాతన అనుభవించాం



విజిట్ వీసా మీద మలేషియాకు వెళ్లిన మమ్మల్ని అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి జైలులో వేశారు. ఏడు నెలల 17 రోజులపాటు జైలులో నరకయాతన అనుభవించాం. జైలులో కడుపునిండా తిండి పెట్టకపోవడంతో అనారోగ్యానికి గురయ్యాం.

– యమునూరి రవీందర్, మున్యాల్

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు



బాలుడిని అప్పగిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: తప్పిపోయిన బాలుడిని బాలల సంరక్షణ అధికారులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఎనిమిదేళ్ల బాలుడు ఈనెల 13న ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఏడుస్తూ కనిపించడంతో రైల్వే సిబ్బంది బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందించారు. బాలుడు ఆకోల అని చెప్పడంతో మహారాష్ట్ర ప్రాంతంలో గాలించారు. సోషల్ మీడియా, దినపత్రికల్లో బాలుడు అదృశ్యమైనట్లు వార్తలు ప్రచురితం అయ్యాయి. ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన దంపతులు రవి, తమ కుమారుడని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సోమవారం బాలుడిని ఐసీపీఎస్ అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, సభ్యులు దశరథ్, డేవిడ్, బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, వినోద్, పద్మ, అశ్విని పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని ఒకరు మృతి

బెల్లంపల్లి: పట్టణంలోని గాంధీనగర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపారు. తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒడ్నాల వెంకటేష్ (32) ఆదివారం రాత్రి నడుచుకుంటూ జాతీయ రహదారిని దాటుతుండగా బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో ఢీకొని మహిళ..



వనిత (ఫైల్)

జన్నారం: బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరిన మహిళను ఆటో రూపంలో మృత్యువు కబళించింది. ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లింగపూర్‌కు చెందిన ఉప్పల్‌వార్ వనిత (హేమలత) (35) మూడు రోజుల క్రితం తన తల్లి కస్తూలపూరి గంగాలక్ష్మి ఇంటికి వచ్చింది. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కలమడుగులోని బంధువుల ఇంటికి వెళ్లింది. కలమడుగు నుంచి రేండ్లగూడ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో అతివేగంగా ఢీకొట్టింది. వనితకు తీవ్ర గాయాలుకాగా తల్లి గంగాలక్ష్మీకి కాలు, విరిగింది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ వనిత రాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరుడు నరేశ్ ఫిర్యాదు మేరకు ఘటనకు కారణమైన ఆటోడ్రైవర్ హన్మండ్ల సత్తన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మొబైల్ షాపులో చోరీ

సాత్నాల: బోరజ్ మండలం కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు శ్యామ్ ఆన్‌లైన్ మొబైల్ షాపు షటర్ పగులగొట్టి రూ.30వేలు అపహరించినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. సోమవారం ఉదయం శ్యామ్ తన దుకాణానికి వెళ్లగా షటర్ పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి గాయాలు



గాయపడిన వెంకటేశ్వర్లు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొట్టిన ఘటనలో ఎరుకల వెంకటేశ్వర్లు అనే సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమగూడెంకు చెందిన వెంకటేశ్వర్లు స్కూటీపై బెల్లంపల్లి వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కుడికాలు తెగిపోయింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈవిషయమై కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదన్నారు.

పాఠశాల బస్సు డ్రైవర్‌కు జైలు

తాండూర్: సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్, ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో అచ్చలాపూర్ నుంచి రేపల్లెవాడ వైపు వెళ్తున్న సెయింట్ థెరిస్సా పాఠశాల బస్సును ఆపి డ్రైవర్ తోట సత్యనారాయణకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి బెల్లంపల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

మంత్రి జూపల్లిని కలిసిన నేతలు



మంత్రితో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు

కైలాస్‌నగర్/తలమడుగు: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావును ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బోథ్ మాజీ ఎమ్మెల్యే బాపురావు, విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న యాదవ్, శ్యామ్ నాయక్ హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో కలిశారు.

26, 27 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన

బాసర: ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాలలో స్పోర్ట్స్, ఎన్‌సీసీ, క్యాప్, పీహెచ్‌సీ కోటాల కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. 26న క్యాప్, పీహెచ్‌సీ, 27న స్పోర్ట్స్, ఎన్‌సీసీ, విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు బాసర క్యాంపస్ ఆవరణలో హాజరు కావాలని ఆయన సూచించారు. పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థుల తుది ఎంపిక జాబితా విడుదల చేయబడుతుందని వెల్లడించారు. జనరల్ కోటా అభ్యర్థుల తుది ఎంపిక జాబితా జూలై 4న విడుదల చేసి 7న మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కోకన్వీనర్ డాక్టర్ దేవరాజు, బండి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి: మండలంలోని నంబాల సమీపంలో ట్రాలీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. గ్రామానికి చెందిన మధుకర్‌పై కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న సుమారు 7 క్వింటాళ్ల 70 కిలోల బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్ఐ మురళీకృష్ణకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తిర్యాణి మండలం ఎర్రబండకు చెందిన గ్రామస్తులు పాఠశాల మంజూరు చేయాలని, గాదిగూడ మండలం చిత్తగూడ గ్రామస్తులు అంగన్‌వాడీ టీచర్‌ను నియమించాలని, తదితర సమస్యలపై 215 దరఖాస్తులు సమర్పించారు. ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, డీడీ అంబాజీరావు, పీహెచ్‌వో సందీప్, ఏడీఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, ఏవో దామోదర స్వామి, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

ఆదివాసీలకు హక్కుపత్రాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న గ్రామీణ పేదల సంఘం నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతాత్ రాందాస్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీవో ఖుష్బూ గుప్తాకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్మ, ఎల్లయ్య, నర్సయ్య, చంద్రయ్య, శంకర్, సంధ్య, నంబాజీ, తదితరులు పాల్గొన్నారు.

'షెటర్లు రద్దుచేయాలి'

బెల్లంపల్లి: అనర్హులకు కేటాయించిన సమీకృత కూరగాయల మార్కెట్ షెటర్లను రద్దు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి కె.అరవింద్, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కమల, తాండూర్ మండల ఇన్‌చార్జి శ్రీనివాస్, యుగంధర్, సుమలత, సంతోష్ అగర్వాల్, లావణ్య, గౌస్‌బాబా, కళావతి, రాజేశ్వరి, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళలకు అస్వస్థత

తాంసి: మండలంలోని అట్నంగూడకు చెందిన ముగ్గురు మహిళలు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన జ్యోత్స్న, లక్ష్మి, అనుసూయ వాంతులు, విరోచనాలు చేసుకోవడంతో అంబులెన్సులో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

ఎడ్లబండిని ఢీకొన్న ట్రాక్టర్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లిలో ఎడ్ల బండిని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో రైతుతోపాటు ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన టాకిరే కాశీనాథ్ ఎడ్లబండిపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు ఈస్‌గాం ఏఎస్సై హీరామన్ గ్రామస్తులతో చర్చలు జరిపారు.

పలువురిపై కేసు నమోదు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపారు. జాడి నారాయణ, వేల్పుల మొగిలి, పొన్నాల జనార్ధన్, మెండె కిష్టయ్య, ఇందూరి రమేష్, లింగంపల్లి అంకులు, లింగంపల్లి సంతోష్, రేచవేని రాజేశ్, లింగంపల్లి రాజం, లింగంపల్లి బాపు, లింగంపల్లి తిరుపతి, కంబాల రాజలింగు, కంబాల మల్లేశ్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.